క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

తుర్కయంజాల్: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం క్యాలెండర్‌ను ఆదివారం చైర్మన్ ఆవిష్కరించారు. రైతులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, సంజీవ రెడ్డి, స్వప్న, సత్యనారాయణరెడ్డి, సీఈఓ రాందాసు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం: ఎస్ఎఫ్ఐ



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచాల: ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మంచాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయం ఎదుట ఆ సంఘం జెండాను సభ్యులు ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని సభ్యులు తెలిపారు. ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా నాయకుడు తరంగ్, మండల నాయకులు రాజేష్, దివాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



క్రీడాకారులతో ఎస్ఐ శ్రీశైలం, అతిథులు

యాచారం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని ఎస్ఐ శ్రీశైలం పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యాచారం మండలం చౌదర్‌పల్లిలో సీపీఎల్‌-2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎస్ఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చౌదర్‌పల్లి గ్రామం అంటేనే ఉద్యోగాల ఖిల్లాగా పేరొందిందని అన్నారు. గ్రామంలో మొదటి నుంచి ఎంతో మంది ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంజాపూర్‌లో అయ్యప్ప మహాపడిపూజ

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరిత ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజకు అయ్యప్పస్వాములు పెంద సంఖ్యలో హాజరయ్యారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 41 రోజుల పాటు నిష్ఠతో ఉండిస్వామికి పూజలు చేయడం అదృష్టమని అన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ శబరిమల యాత్రను పూర్తిచేసుకోవాలని సూచించారు. కౌన్సిలర్‌లు సునీల్, నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులోని బేకరీలో కేకుల విక్రయాలు

కోటి ఆశలతో..

ఆమనగల్లు: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలకు యువత సిద్ధమైంది. కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ వేడుకలు చేసుకోవడానికి యువతతో పాటు చిన్నారులు ఉత్సాహం చూపుతున్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం నూతన సంవత్సర సందడి కనిపించింది. స్థానిక బేకరిల్లో పెద్దఎత్తున కేకులను కొనుగోలు చేశారు. అలాగే ఇంటిముందు ముగ్గులు వేయడానికి మహిళలు రంగులను కొనుగోలు చేశారు. చికెన్, మటన్‌షాపులలో పెద్దఎత్తున కొనుగోళ్లు జరిగాయి. మరోవైపు నూతన సంవత్సర వేడుకల కోసం దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు.



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



విజేతలకు చెక్కు, ట్రోఫీ అందజేసిన అతిథులు

నాగర్‌కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఐక్యతా ఫౌండేషన్ ప్రోత్సాహం అందిస్తుందని నాగర్‌కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్‌-3 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ బల్‌రాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి గెలుచుకున్న ఛత్రపతి శివాజీ టీంకు రూ.25వేలు నగదు, ట్రోఫీ, రెండవ బహుమతి గెలుచుకున్న వివేకానంద టీంకు రూ.15వేలు, ట్రోఫీని అందించారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాపోటీల నిర్వహణకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబర్‌సింగ్, ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు శ్రీరాములు, పరమేశ్, కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామ మందిర అక్షింతల ఊరేగింపు



ఇబ్రహీంపట్నం రూరల్: అక్షింతలు తీసుకుంటున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తుర్కయంజాల్: శ్రీరాముడి దివ్య అక్షింతలు ప్రతి ఒక్కరికి అందేలా సహకరించాలని యంజాల్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి, బీజేపీ నేత కొంద్రు పురుషోత్తం అన్నారు. అయోధ్యలోని రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలకు ఆదివారం గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రతి కాలనీ సంక్షేమ సంఘాల నుంచి ఇంటింటికి అక్షింతలను పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంశీధర్ రెడ్డి, బీజేపీ యువజన విభాగం నాయకులు కార్తీక్ గౌడ్, ప్రేమ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపటేల్‌గూడలో శోభాయాత్ర

ఇబ్రహీంపట్నం రూరల్: రామ మందిరం ప్రారంభోత్సవానికి ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎంపీపటేల్‌గూడలో అయోధ్య రామయ్య అక్షింతలు శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు . జనవరి 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి డాక్టర్ శశిధర్, బీజేపీ జిల్లా కార్యదర్శి పొట్టి రాములు, బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరి, శ్రీశైలంల తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం వీడేనా?

- మరోసారి నిలిచిన జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు
- 2008లో కేంద్రమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- కోర్టు కేసులతో పలుమార్లు పనులకు బ్రేక్
- త్వరగా పూర్తిచేయాలంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



అసంపూర్తిగా ఉన్న జూనియర్ కళాశాల భవనం

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులకు గ్రహణం వీడటం లేదు. భవన నిర్మాణ పనులు ఇటీవల నిలిచిపోయాయి. దీంతో ఈ ఏడాదైనా నూతన భవనంలోకి కళాశాల మారుతుందని భావించిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. భూ వివాదం కారణంగా నిర్మాణ పనులు తరచూ నిలిచిపోతున్నాయి. భూవివాదాన్ని పరిష్కరించి భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

భవనం అందుబాటులో లేకపోవడంతో..

ఆమనగల్లు పట్టణంలో 2000 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో భవనం అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనంలోనే కొన్ని గదులు కేటాయించి తరగతులను ప్రారంభించారు. అప్పటినుంచి జూనియర్ కళాశాల ఆ పాఠశాల ఆవరణలోనే కొనసాగుతోంది. అరకొర వసతుల మధ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

9.15 ఎకరాల భూమి కొనుగోలు

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం 2004లో ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి దాతల సహకారంతో 9.15 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అదే ఏడాది భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. అప్పటి కేంద్ర మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు.

భూవివాదంతో నిలిచిన పనులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించిన కొన్ని రోజులకే భూవివాదం తలెత్తడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. అప్పట్లో భూమిని కొనుగోలుచేసి ప్రభుత్వం పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే దీనిపై కొందరు ఆ భూమిపై తమకు హక్కులు ఉన్నాయని కోర్టుకు వెళ్లడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

రూ.2 కోట్లు మంజూరు

నిలిచిపోయిన జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించడానికి రూ.2 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్నేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుని భూ వివాదం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. అంతేకాకుండా భవన నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయించారు. దీంతో మరోసారి అప్పటి విద్యాశాఖామంత్రి సబితారెడ్డి 2022లో భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు ప్రారంభమైనప్పటికీ కోర్టు కేసుల కారణంగా ఇటీవల మరోసారి పనులు నిలిచిపోయాయి. భూవివాదం పరిష్కరించి భవన నిర్మాణం పూర్తిచేయాలని విద్యార్థిసంఘాలు, విద్యార్థులు ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరుతున్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న జయరాంనాయక్

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కందుకూరు ఎంపీడీఓ వెంకట్రాములు, ఆమనగల్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ రమేశ్‌నాయక్, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు సోన జయరాం సత్కరించారు. నాయకులు బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ..

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ ఎంపీటీసీ సరిత గణేశ్‌గుప్త అత్త ఆదివారం హైదరాబాద్‌లోని శ్రీకర్ హాస్పిటల్‌లో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించారు. నాయకులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోలి సురేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలో అనారోగ్యానికి గురైన పలువురిని ఆదివారం స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన శ్రీను, చెన్నయ్య, కరుణాకర్ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని, స్థానిక నాయకులతో కలిసి వారిని పరామర్శించారు. బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వార్డు సభ్యులు మల్లయ్య, భిక్షపతి, రాంచంద్రయ్య, నాయకులు లాయక్‌అలీ, చెన్నయ్య, యాదయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళకు..

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాలకి చెందిన వార్డుసభ్యురాలు కల్వకోలు మణెమ్మ గుండెనొప్పితో హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం మణెమ్మను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, కుమార్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం: ఎంపీపీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడులో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న మంచిరెడ్డి విక్రంరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అందజేశారు. వారు మాట్లాడుతూ.. సెషన్‌-6 చాంపియన్స్‌లో రూ.30వేల బహుమతి అందజేశామని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్మినేడు ఉప సర్పంచ్ మార్త, వార్డు సభ్యులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి: బీఆర్ఎస్

ఆమనగల్లు: యాసంగి పంట సాగుకు ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం సాయం ఠంచన్‌గా పడేవని.. ప్రస్తుతం ఏర్పడిన నూతన ప్రభుత్వం రైతులకు సాయం అందించడంలో తాత్సారం చేస్తోందన్నారు. పెట్టుబడి సాయం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.